సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ఆద్యంతం.. సందేశాత్మకం
చెడు వ్యవసనాల పర్యవసానాన్ని వివరిస్తూ సాగిన నాటికల ప్రదర్శన సీలేరు వాసులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. 8లో



ఘనంగా శ్రీపుష్పయాగం
సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీ పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు.



ఆకట్టుకున్న కోలాటం
విశాఖ: బంగారుమెట్టలో శ్రీ రామ ఆంధ్ర యువ జన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

నమ్మక ద్రోహులు

నమ్మక ద్రోహం పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత. వీరికి రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేసి పార్టీ ఫిరాయించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధిచెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన గిడ్డి ఈశ్వరి ఘోర పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో అత్యధికంగా గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ వైపే నిలిచారు. మాజీ ఎంపీ కొత్తపల్లి గీతదీ అదే పరిస్థితి. ఎన్నికైన నాటి నుంచి ఆమె వైఎస్సార్‌సీపీ ఆశయాలకు తిలోదకాలిచ్చి.. ఆర్థికంగా ఎదిగేందుకు.. కేసుల్లోంచి బయటపడేందుకు ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల బరిలో ఉన్న వీరికి గిరిజనులు మళ్లీ ఓటుతో బుద్ధి చెప్పనున్నారు.

- రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు
- పార్టీని ఫిరాయించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత
- స్వప్రయోజనాలకు ప్రాధాన్యం
- 2019 ఎన్నికల్లో 'గిడ్డి' ఘోర పరాజయం
- ఓటుతో బుద్ధి చెప్పిన గిరిజనులు
- నకిలీ ఎస్టీ కేసులో తప్పించుకునేందుకు టీడీపీకి చేరువైన గీత
- ఈ ఎన్నికల్లోనూ మళ్లీ వారికి ఎదురుకానున్న చేదు అనుభం





సాక్షి,పాడేరు: మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.. మాజీ ఎంపీ కొత్తపల్లి గీత.. వీరు రాజకీయాలకు కొత్త అయినప్పటికీ ప్రజలకు సేవ చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. 2014 ఎన్నికల్లో పాడేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన గిడ్డి ఈశ్వరి, అరకు ఎంపీ కొత్తపల్లి గీత ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చి గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదు. వ్యక్తిగత ఎదుగుదలను ఆశించిన వీరు రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్‌సీపీకి నమ్మక ద్రోహం చేసి పార్టీ ఫిరాయించారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పాడేరు అసెంబ్లీకి పోటీ చేసిన గిడ్డి ఈశ్వరి ఘోర పరాజయం పాలయ్యారు. ఈఎన్నికల్లో గిరిజనులు ఓటుతో తగిన గుణపాఠం చెప్పి తాము జగనన్న వెంటే ఉన్నామని మళ్లీ నిరూపించారు.

'గిడ్డి' చేరికతో గ్రూపుల మయం

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి టీడీపీలో చేరికతో పాడేరు అసెంబ్లీలో ఆ పార్టీ గ్రూపులుగా విడిపోయింది. ఆది నుంచి పార్టీలో ఉన్నవారిని పక్కన బెట్టి స్వార్థ రాజకీయాలకు ఆమె తెరలేపారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీంతో సీనియర్లంతా ఆమె నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆమెకు మద్దతు ఇచ్చేది లేదని ఇప్పటికే వారంతా బహిరంగంగా ప్రకటించడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చంద్రబాబు ప్యాకేజీ..ప్రలోభాలకు లోనై వైఎస్సార్‌సీపీని వీడారని అప్పట్లో ఆమెపై జోరుగా ప్రచారం సాగింది. రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్‌సీపీకి నమ్మక ద్రోహం చేయడం.. టీడీపీలో సీనియర్లకు ఝలక్ ఇవ్వడం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ఆమెకు నష్టం చేయవచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

చంద్రబాబు తల నరుకుతానని హెచ్చరిక

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో 2014లో పాడేరు ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి ఈశ్వరి వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేశారు. 2015లో బాక్సైట్ వ్యతిరేక పోరాటంలో భాగంగా ఆమె చింతపల్లి వద్ద అప్పటి సీఎం చంద్రబాబు తల నరుకుతానని హెచ్చరించడం అప్పటిలో సంచలనమైంది. తరువాత ఆమె అదే పార్టీలో చేరడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

- ఆర్థిక, రాజకీయ అవసరాలకు తలొగ్గిన ఈశ్వరి 2017 నవంబర్‌లో టీడీపీలో చేరారు. టీడీపీ ప్రభుత్వంలో రాజకీయంగా లబ్ధి పొందినప్పటికీ గిరిజనుల ఆదరణ కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి పోటీ ఇవ్వలేకపోయారు.

కేసు నుంచి తప్పించుకునేందుకు..

అరకు మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత 2014 ఎన్నికల తరువాత నకిలీ ఎస్టీ కేసును ఎదుర్కొన్నారు. ఎస్టీలోని వాల్మీకి కులస్తురాలని వైఎస్సార్‌సీపీని నమ్మించి 2014లో అరకు పార్లమెంట్ సీటు పొందారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో గిరిజనులు ఆమెను 91,398 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందిన టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి అరకు ఎంపీ గీత ఎస్టీ కాదని ఆమెపై కోర్టులో కేసు వేశారు. ఆమె ఎస్టీ కాదని, నకిలీ ధ్రువపత్రంతో చదువులు, ఉద్యోగం, పదవులను అక్రమంగా అనుభవించారని ఆధారాలు చూపిస్తూ సంధ్యారాణి విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె 2015లో టీడీపీకి చేరువైంది. ఈమెపై కోర్టులో కేసు పెట్టిన సంధ్యారాణి ఉపసంహరించుకున్నారు. కేసునుంచి బయట పడేందుకే టీడీపీతో చేతులు కలిపారన్న విమర్శలను ఆమె ఎదుర్కొన్నారు.

బ్యాంక్‌ను మోసగించారని..

- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసులో భర్తతోపాటు ఆమెకు సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందారు. బ్యాంకును మోసగించి రూ.42 కోట్ల మేర రుణం పొందారన్నది వారిపై అభియోగం.
- తెలంగాణలోని రాయదుర్గం సమీపంలో వందెకరాల భూవివాదంలో ఆమె పాత్రపై కేసు నడుస్తోంది.

గిరిజన సంక్షేమానికి దూరం

కొత్తపల్లి గీత ఎంపీగా ఉన్న సమయంలో అరకు పార్లమెంట్ పరిధిలోని గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించారు. ఓట్లు వేసి గెలిపించిన గిరిజనులకు కూడా ద్రోహం చేశారు. టీడీపీతో అవసరం తీరాక సొంతంగా జన జాగృతి పేరుతో పార్టీని పెట్టారు. 2019లో విశాఖ ఎంపీ స్థానానికి పోటీచేసిన ఆమె ఘోర పరాజయం పాలయ్యారు. కేవలం 1500 లోపు మాత్రమే ఓట్లు వచ్చాయి. ఆ తరువాత ఈ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకున్న ఆమె వారి సహకారంతో బీజేపీ నేతగా మారారు. ఇప్పుడు అరకు ఎంపీ అభ్యర్థిగా ఆ పార్టీ తరపున బరిలో ఉన్నారు. టీడీపీ వ్యవహారాల్లో కూడా ఆమె తలదూర్చుతున్నారని ప్రచారం జరుగుతుండటంతో ఆ పార్టీ శ్రేణులు రగిలిపోతున్నాయి. పాడేరు, అరకు నియోజకవర్గాల్లో టీడీపీ ముఖ్య నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్‌సీపీకి ద్రోహం చేసిన వీరి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగానే ఉంది. మళ్లీ గతంలో మాదిరిగా అదే ఫలితం ఎదురుకానుంది.

జగనన్న నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు

- మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి
- నియోజకవర్గ పరిధిలో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తాం
- అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి



సాక్షి,పాడేరు: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి విశేష సేవలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి తెలిపారు. బుధవారం పార్వతీపురం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

సీఎంపై నమ్మకాన్ని రుజువు చేసేలా..

నామినేషన్ కార్యక్రమానికి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావడంతో సీఎం జగన్‌పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని రుజువు చేసిందన్నారు. తాను రాజకీయాలకు కొత్త అన్నారు. వైద్యురాలిగా పాడేరు ఐటీడీఏ పరిధిలో తోటి గిరిజనులకు సేవ చేస్తున్నానని తనూజారాణి పేర్కొన్నారు.

తమ కుటుంబానికి రాజకీయ నేపథ్యం..

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోడలుగా, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌కు భార్యగా, తన తండ్రి గుమ్మా శ్యాంసుందర్ హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారని.. తమ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉందని తనూజారాణి తెలిపారు.

అనూహ్యంగా అవకాశం..

అనూహ్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అరకు పార్లమెంట్ బరిలో నిలిపి గిరిజనులకు సేవచేసే భాగ్యం కల్పించారన్నారు. ఆయన ఆశయానికి తగ్గట్టుగా గిరిజనులకు సేవ చేస్తానని చెప్పారు. అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని వర్గాల ఓటర్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనే ఆశయంతో ఉన్నారన్నారు. ఆ నమ్మకమే ఎంపీగా, నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులను గెలిపిస్తుందన్నారు.

ప్రతీ కుటుంబానికి ఆర్థిక లబ్ధి

జగనన్న ప్రభుత్వం అర్హత గల ప్రతీ కుటుంబం పథకాల రూపంలో ఆర్థికంగా లబ్ధిపొందిందన్నారు. భారీ మెజారిటీతో విజయం సాధించి గిరిజన ప్రాంత సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అప్పన్న దేవస్థానం ఉద్యోగుల కోడ్ ఉల్లంఘన!

సింహాచలం: ఎన్నికల నియమావళిని సింహాచలం దేవస్థానం ఉద్యోగులు అతిక్రమించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు నామినేషన్ సందర్భంగా ఏకంగా విజయనగరం వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించినట్టు ప్రచారం జరుగుతోంది. ఏఈఓతో పాటు సూపరింటెండెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగి ఉన్నట్టు తెలుస్తోంది. వైదిక సిబ్బంది కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అత్యుత్సాహం : ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి దేవస్థానంలో నిబంధనలు అమలు చేస్తున్నారు. వీఐపీలకు సైతం స్వామివారి దర్శనాల్లో నియమావళిని కచ్చితంగా పాటిస్తున్నారు. అలాంటిది ఉద్యోగులే కోడ్ నిబంధనలు ఉల్లంఘించి అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుండగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించిన అక్షింతలు, ప్రసాదంతో పాటు మే 10న జరిగే చందనోత్సవానికి సంబంధించిన మినిట్స్‌ను అశోక్‌గజపతిరాజుకు ఇచ్చేందుకే సదరు ఉద్యోగులు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

మలేరియా నిర్మూలనపై అవగాహన అవసరం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు : ఏజెన్సీలో మలేరియా నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రూపొందించిన ఫ్లెక్సీలను బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. మలేరియాపై అవగాహన కల్పించేందుకు ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రచార ఫ్లెక్సీలను పంపించాలని కోరారు. ఏజెన్సీలో మొదటి విడత దోమల మందు పిచికారి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. మలేరియా నిర్మూలన కోసం వైద్యారోగ్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు.నీ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి.. భర్త అరెస్టు



నిందితుడు కొండబాబుతో ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసులు

జి.మాడుగుల: భార్యపై కత్తితో దాడికి పాల్పడిన భర్తను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలోని లువ్వాసింగి పంచాయతీ వలసమామిడి గ్రామానికి చెందిన సారే కొండబాబు భార్య సత్యవతికి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో ఆమె కత్తితో దాడి చేసినట్టు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమెను కేజీహెచ్‌లో చికిత్స పొందుతుందన్నారు. ఆమె తండ్రి మసాడి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

అరకు పార్లమెంట్‌కు 10 నామినేషన్లు



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి



రంపచోడవరం అసెంబ్లీకి నామినేషన్ అందజేస్తున్న మానుపూడి సుబ్బారావు

సాక్షి,పాడేరు: అరకు పార్లమెంట్ స్థానానికి బుధవారం ఒక్కరోజే పది నామినేషన్లు దాఖలు అయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి ఆర్వో నిషాంత్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. సీపీఎం తరపున కిల్లో సురేంద్ర, పాచిపెంట అప్పలనరస, స్వతంత్ర అభ్యర్థులుగా జోరంగి వెంకటరావు, నిమ్మక జయరాజు, సమరెడ్డి బాలకృష్ణ, అశోక్‌కుమార్, ఇండియన్ ప్రజాబంధు పార్టీ తరపున ఊయక చెంచులు, బీజేపీ తరపున కొత్తపల్లి గీత రెండు సెట్ల నామినేషన్లు అందజేశారు.

పాడేరు అసెంబ్లీకి పది..

పాడేరు అసెంబ్లీ స్థానానికి 10 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిగా కిముడు శివరత్నం, సమాజ్‌వాది పార్టీ నుంచి మినుముల రాంబాబు, బీఎస్పీ నుంచి సుర్ల అప్పారావు, ఐపీబీపీ నుంచి కింటుకురి జోషఫ్, బీసీవైపీ నుంచి కిల్లో రంగారావు, స్వతంత్రులుగా చిరికి అపిరియంబాబు, చిరికి గులాబి, కొక్కుల కన్నబాబు, వల్ల మౌనిక, అడపా విష్ణుమూర్తి నామినేషన్లను ఆర్వో భావన వశిష్ఠకు అందజేశారు.

అరకు అసెంబ్లీకి 13..

పాడేరు: అరకు అసెంబ్లీ స్థానానికి సంబంధించి బుధవారం నామినేషన్లు వెల్లువెత్తాయి. 13 దాఖలు అయినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున శెట్టి గంగాధర స్వామి, అదే పార్టీ రెబల్ అభ్యర్థిగా పాచిపెంట శాంతికుమారి, బీజేపీ డమ్మీ అభ్యర్థిగా పాంగి శ్రీలక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీ తరపున బురిడి ఉపేంద్ర రెండో సెట్, బీసీవై పార్టీ తరపున దురియా సాయిబాబా, లిబరేషన్ కాంగ్రెస్ తరపున కిల్లో అనిల్‌కుమార్, ఆంధ్రరాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా పాంగి నీలమ్మ, స్వతంత్ర్య అభ్యర్థులుగా అడకట్ల వైకుంఠరావు, మొస్యా సుజాత, సమర్థి భవాని, సరాజి గోవిందరావు, సమర్థి గులాబి, సమర్థి రఘునాథ్ అందజేశారు.

రంపచోడవరం అసెంబ్లీకి రెండు..

రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ఆరవ రోజు బుధవారం రెండు నామినేషన్లు స్వీకరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. మారేడుమిల్లి మండలం తాడేపల్లికి చెందిన దుమంతు విశ్వనాథం ఒకటి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కపిలేశ్వరపురం మండలం వద్లమూరుకు చెందిన మానుపూడి సుబ్బారావు నామినేషన్ పత్రాలు అందజేశారని ఆయన తెలిపారు.

అట్టహాసంగా తనూజారాణి నామినేషన్



అరకు పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గుమ్మా తనూజారాణి బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఆమెకు మద్దతుగా నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. 8లో

క్లుప్తంగా

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని కలిసిన పార్వతమ్మ



ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్వతమ్మ

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కురుసా పార్వతమ్మ బుధవారం రాత్రి పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్వతమ్మ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి విస్తృత ప్రచారం చేయాలని ఆమె కోరారు.

అప్పన్న సన్నిధిలో వీహెచ్‌పీ అంతర్జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ



సింహగిరిపై వీహెచ్‌పీ అంతర్జాతీయ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మిలింద్ శ్రీకాంత్ పరాండే జి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, అఖిల భారత సెక్రటరీ జనరల్ మిలింద్ శ్రీకాంత్ పరాండే జి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన వెంట విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తనికెళ్ల సత్య రవికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సురక్షా ప్రముఖ్ పూడిపెద్ది శర్మ తదితరులు ఉన్నారు.

350 లీటర్ల సారా స్వాధీనం



దాడుల్లో పట్టుకున్న సారా తయారీ సామాగ్రి

ఎటపాక: సారా స్థావరాలపై ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఎక్సైజ్, పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఎటపాక మండల పరిధిలోని గుండువారిగూడెంలో చేపట్టిన దాడుల్లో 350 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 12,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్టు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ నాగరాహుల్ తెలిపారు. ఈ దాడుల్లో తెలంగాణ,ఆంధ్రా పోలీసు, సీఆర్పీఎఫ్ బలగాలు, ఎక్సైజ్, పోలీసులు పాల్గొన్నారు.

దర్శనానికి వచ్చి ఉంగరం దొంగిలిస్తారా..?

- సింహగిరిపై భక్తులను ప్రశ్నించిన అర్చకులు
- దొంగిలించలేదంటూ కన్నీటిపర్యంతమైన భక్తులు
- చివరికి వినోదోత్సవమని తెలుసుకుని సంభ్రమాశ్చర్యం
- నవ్వుల సందడిగా జరిగిన కార్యక్రమం



దేవస్థానం అర్చకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విజయనగరానికి చెందిన భక్తురాలు



స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ప్రశ్నించడంతో భయభ్రాంతులు చెందుతున్న ఆరిలోవకు చెందిన నూతన దంపతులు



రాజయ అలంకరణలో అప్పన్న

సింహాచలం: 'శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా? మర్యాదగా దొంగిలించిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం..'అని సింహాచలం కొండకి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించే సరికి వారంతా కంగుతిన్నారు. 'మేం దొంగల్లా కనిపిస్తున్నామా.! స్వామి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధించి తీసుకొస్తారా..'అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులపై గర్జించారు. 'చూడండీ.. మీరు దొంగతనం చేసినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. పోలీసులు తీసుకెళ్లక ముందే దొంగిలించిన ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి.' అంటూ స్థానాచార్యులు మరింత గర్జించి అడగటంతో భక్తుల కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. తాము ఉంగరం తీయలేదని ఎంత చెబుతున్నా వినకుండా మీరే దొంగ అంటూ పదే పదే ప్రశ్నించడంతో వారంతా ఆగ్రహంతో చిందులు వేశారు. పైగా చేతికున్న ఉంగరాలను చూపెట్టమని.. దొంగిలించిన ఉంగరంలా ఇవి ఉన్నాయంటూ స్థానాచార్యులు అడగటంతో భక్తుల నోటి మాట రాలేదు. చివరికి ఇదంతా వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని భక్తులంతా సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనందభరితులయ్యారు. ఇదీ సింహగిరిపై బుధవారం నవ్వుల సందడిగా జరిగిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి వినోదోత్సవం. స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన ఉంగరం వెతికే ఘట్టాన్ని బుధవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు.

ఏడు పరదాల్లో దాగి ఉన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకీలో అధిష్ఠింపజేశారు. స్వామి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర, తాడు పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాళ్లతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ దొంగిలించిన ఉంగరాన్ని ఇవ్వాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం చెందారు. ఉత్సవం గురించి తెలిసిన వాళ్లు నవ్వుతూ సమాధానం చెప్పారు. ఈ తరుణంలోనే స్వామిపై ఉన్న ఒక్కొక్క పరదాను తొలగించారు. చివరికి స్వామి చివరి పరదాలోనే ఉంగరం దొరికింది. ఎస్.కోట మండలం బొద్దాంకి చెందిన నూతన దంపతులు ఈశ్వరరావు, మాధవి, ఆరిలోవ ప్రాంతానికి చెందిన మౌళీ, గౌతమి, ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు హిమజ, ప్రత్యూష, లావణ్య, శ్వేత అశ్విని, టెక్కలికి చెందిన అక్కాతమ్ముళ్లు జీవిత, నవీన్‌కుమార్‌లను పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాళ్లతో బంధించి తీసుకురాగా వారిని స్థానాచార్యులు ప్రశ్నించారు. విజయనగరం జిల్లా దాసన్నపేటకి చెందిన రోజా అనే మహిళ తన కుమార్తె మిక్కి, అల్లుడు కిశోర్, మనవలతో కలిసి సింహగిరికి రాగా వారిని తాళ్లతో బంధించారు. వాళ్ల చేతికి ఉన్న ఉంగరం.. దొంగిలించిన ఉంగరంగానే ఉందని స్థానాచార్యులు, అర్చకులు అనుమా నం వ్యక్తం చేయడంతో వారంతా వాదనకు దిగారు. నా కూతురుకు, అల్లుడికి నిశ్చితార్థం రోజు పెట్టిన ఉంగరాలు ఇవని, దొంగిలించినవి కాదని స్థానాచార్యులతో రోజా వాదించారు. ఇదిలా ఉండగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఆలయ కొత్వాల్ నాయక్ లంక సూరిబాబు, ఆలయ ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సైతం దొంగలుగా పట్టుపట్టారు. తొలుత స్థానాచార్యులను కూడా తాళ్లతోనే బంధించి తీసుకురావడం విశేషం. అదే సమయంలో సింహగిరి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వినోదోత్సవంలో పాల్గొని.. స్వామిని దర్శించుకున్నారు.



టెక్కలికి చెందిన భక్తులను ప్రశ్నిస్తున్న స్థానాచార్యులు



ఈవోని తాళ్లతో బంధించిన పురోహిత్ అలంకారి



చివరి పరదాలో ఉంగరాన్ని వెతుకుతున్న అర్చకులు



దొరికిన ఉంగరాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి

అట్టహాసంగా తనూజారాణి నామినేషన్

- వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థిగా దాఖలు
- కలెక్టరేట్‌కు తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు



తనూజారాణి నామినేషన్‌కు అరకు నుంచి బయలుదేరిన శ్రేణులు

పార్వతీపురం మన్యం జిల్లా: వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థిగా గుమ్మా తనూజారాణి బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె రెండుసెట్లు, ఆమె భర్త వినయ్ ఒక సెట్టు నామినేషన్ పత్రాలను అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు అందజేశారు. ఆమెకు మద్దతుగా వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. అనంతరం తనూజారాణి మాట్లాడుతూ మే 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే ప్రజల ఆకాంక్షగా పేర్కొన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనే తనను భారీ మెజారిటీతో గెలిపిస్తుందన్నారు.

అరకు నుంచి భారీగా..

అరకులోయ రూరల్: అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గుమ్మా తనూజారాణి నామినేషన్ కార్యక్రమానికి అరకు నియోజకవర్గం నుంచి భారీగా పార్వతీపురం తరలివెళ్లారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో డుంబ్రిగుడ జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీలు ఉషారాణి, ఈశ్వరి, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మహిళా విభాగ అధ్యక్షురాలు శాంతి సుమిత్ర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు,యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్

జగనన్నకు అండగా నిలుద్దాం



కాశీపట్నంలోని ప్రచారంలో గిరిజనులకు అభివాదం చేస్తున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

అనంతగిరి: జగనన్నను గెలిపిద్దాం.. సంక్షేమాన్ని కొనసాగిద్దామని, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కాశీపట్నం వారపు సంతలోని బుధవారం వైఎస్సార్‌సీపీ ప్రచారం హోరెత్తింది. అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం గిరిజనులకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. ముందుగా గిరిజన మహిళలు గిరిజన సంప్రదాయంలోని స్వాగతం పలికి, హారతులిచ్చి, తిలకందిద్ది, విజయంతో సాగాలంటూ అక్కా, చెల్లెమ్మలు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అనంతరం కాశీపట్నం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, అమ్మా..అక్కా..చెల్లెమ్మా అంటూ సంబోధిస్తూ ప్రచారంలో సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాలనలోనే మన్యప్రాంతాభివృద్ధి జరిగిందన్నారు. దశాబ్దాలుగా కనీస మౌలిక సదుపాయాలకు దూరమైన ప్రాంతాలన్నీ నేడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయన్నారు. మనమంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి జగనన్నను మళ్లీ మనం గెలిపించుకుందామని.. మరింత సంక్షేమం అభివృద్ధి సాధిద్దామని పిలుపునిచ్చారు.ప్రతిపక్ష పార్టీల బూటకపు, మోసపూరిత హామీలను నమ్మవొద్దన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థిగా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేగం మత్స్యలింగం అయిన తనను గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, సర్పంచులు పాంగి అప్పారావు, పెంటమ్మ, సన్యాసిరావు, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, జేసీఎస్ కన్వీనర్ నవీన్, ప్రధాన కార్యదర్శి డానియేలు, మధుసూదన్, నాయకులు గంగన్నదొర, సత్యవతి, కన్నమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.

కాఫీ, మిరియాల తోటలు దగ్ధం



లుంగాపుట్టు వద్ద దగ్ధమైన కాఫీ, మిరియాల తోటలు

ముంచంగిపుట్టు: వనభసింగి పంచాయతీ లుంగాపుట్టు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు కాఫీ, మిరియాలు తోటలకు మంగళవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో 7 ఎకరాల్లో తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. లుంగాపుట్టు గ్రామానికి చెందిన గిరిజన రైతుల గబుడు నాగేశ్వరరావు, గబుడు సత్యం, వల్లంగి రామచందర్, కొండమ్మ, రాము, కిల్లమ్మలకు చెందిన కాఫీ, మిరియాల తోటల నుంచి భారీగా మంటలు వస్తుండడంతో లుంగాపుట్టు గ్రామస్తులు హుటాహుటిన తోటల వైపు పరుగులు పెట్టారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే తోటలంతా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.గుర్తు తెలియని వ్యక్తుల పనిగా గ్రామస్తులు ఆరోపించారు. కాఫీ, మిరియాల తోటలపై ఆధారపడ్డ తాము జీవన ఉపాధి కోల్పోయామని, సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వాపోయారు. అధికారులు ఆదుకోవాలని వారు కోరారు.

అరకులో ఖాళీ అవుతున్న టీడీపీ



కొత్తూరు సర్పంచ్ సీతయ్యతో పాటుగా వార్డు మెంబర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, పరిశీలకులు శోభ హైమావతి, ఎంపీపీ శెట్టి నీలవేణి

- అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం
- ఆ పార్టీకి చెందిన కొత్తూరు సర్పంచ్, వార్డు మెంబర్లు చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానం

అనంతగిరి: అరకు నియోజకవర్గంలోని టీడీపీ క్యాడర్ ఎన్నికలయ్యే లోపు ఖాళీ అవడం ఖాయమని అరకు అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ దంశరాయి గ్రామంలో టీడీపీకి చెందిన కొత్తూరు సర్పంచ్ సీతయ్య, వార్డు మెంబర్లు సారా పైడితల్లి, దమ్మి కన్నబాబు, ఓలేసి అప్పన్న, గాలిపర్తి నాగరాజు, గ్రామపెద్దలు బి. రాయప్ప, జి.రాము, ఎమ్.పైడితల్లి, టీ.తమ్మయ్య, బి.సన్యాసమ్మ, బి.సీతమ్మ, ఎస్.దేవి, ఎస్.సీతమ్మ తదితర 50 కుటుంబాలు ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి బుధవారం మత్స్యలింగం, అరకు నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హైమావతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రేగం మత్స్యలింగం మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశంసించేలా జగనన్న పాలన సాగుతుందన్నారు. టీడీపీని నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టేనని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఓటమి భయంతోనే పొత్తుల రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజలంతా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టినీలవేణి, మండలపార్టీ అధ్యక్షుడు స్వామి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, పెదలబుడు ఎంపీటీసీ దూరియ ఆనంద్, పాడి కృష్ణమూర్తి, బాక సన్యాసిరావు పాల్గొన్నారు.

సక్రమంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు వివేకానందన్

సాక్షి,పాడేరు: జిల్లాలో వచ్చే నెల 13న ఎన్నికలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.వివేకానందన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో పద్మావతి, అన్ని నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన రోజువారి కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో రుపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని షాడో జోన్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎం.విజయసునీత ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆద్యంతం.. సందేశాత్మకం

ఆలోచింపచేసిన 'విముక్తి'



కాపలా నాటికలో గంజాయిపై కుటుంబం చేసిన ప్రదర్శన

సీలేరు: ఆ నాటికలు సందేశాత్మకంగా సాగాయి....అందర్నీ ఆలోచింప జేశాయి. ఒక వైపు జీవిత సారం...మరో వైపు చెడు వ్యవసనాల పర్యవసానం వివరిస్తూ సాగిన ప్రదర్శనలు సీలేరు వాసులను ఆకట్టుకున్నాయి. కాపలాలేని యువతకు చెడు వ్యసనాల నుంచి విముక్తి కలగాలన్న సందేశంతో మారెమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా ఏపీ జెన్‌కో విద్యుత్ కళాభారత్ వేదికగా డివిజనల్ ఇంజినీరు లక్ష్మీనారాయణ ,ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం రెండు నాటికలను ప్రదర్శించారు. ప్రస్తుతం గంజాయికి బానిసలై చదువుకు దూరమై చెడు మార్గాన ఎంచుకుంటున్న యువతకు ఆలోచించే విధంగా సాగిన ×విముక్తి× నాటిక యువతను, తల్లిదండ్రులను ఆలోజింపజేసింది. పక్కదారి పడుతున్న యువతకు 'కాపలా' పెట్టలేమని తెలియజేస్తూ మరో నాటికను ప్రదర్శించారు. ఇది ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికల్లో ప్రతి సన్నివేశం అందర్నీ ఆలోచింపచేసింది. ఈ నాటికలను గుంటూరుకు చెందిన ఉషోదయ కళానికేతన్ కళాకారులు, ఏపీ జెన్‌కో ఉద్యోగులు సంయుక్తంగా ప్రదర్శించారు. కళాకారులను స్థానికులు ఘనంగా సన్మానించారు.

దేవరాపల్లిలో ఈదురుగాలులు

దేవరాపల్లి: ఈదురుగాలుల ధాటికి దేవరాపల్లిలోని సంతతోట, శ్రీరాంపురంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీతంపేటలో పరవాడ లక్ష్మయ్య, గాడి సూర్యనారాయణ తదితరులకు చెందిన రెండు ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. ఉదయం నుంచి ఎండలు మండిపోగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. కాశీపురం, రైవాడ తదితర గ్రామాల్లో చిరుజల్లులు కురవగా, వాలాబులో భారీ వర్షం పడింది. మండు వేసవిలో వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

బాల్య వివాహాల నిర్మూలనకు 'చిట్టి'

పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ప్రతాప్‌శివ కిశోర్

చింతపల్లి రూరల్: మైనర్ల పెళ్లికి బలవంతం చేయబడిన పిల్లల రక్షణ, పునరావాసం కల్పనకు 'చిట్టి'అనే సమగ్ర మిషన్‌ను సబ్ కలెక్టర్ ధాత్రీ రెడ్డి బుధవారం స్థానిక ఏఎస్పీ కార్యలయంలో ఏఎస్పీ ప్రతాప్‌శివ కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ మిషన్ యొక్క ముఖ్య ఉద్దేశం బాల్య వివాహాలు నిర్మూలించి వారికి వృత్తి విద్య నైపుణ్యంతో పాటు ఉన్నత విద్యాభ్యాసం చేయించడమే ధ్యేయమని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు.మండలంలో చికటిమామిడి గ్రామంలో ఈ నెల 20 న 17 ఏళ్ల బాలిక బాల్య వివాహాన్ని పోలీసులు, ఐసీడీఎస్ అధికారుల సహాయంతో అడ్డుకున్నట్టు చెప్పారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ఈ మిషన్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ధాత్రీ రెడ్డి మాట్లాడుతూ ఏజేన్సీ గ్రామాల్లో బాల్య వివాహాలు ఒక ముఖ్య సమస్యగా మిగిలిపోయిందన్నారు. చిన్న వయస్సులో తెలియక చిట్టి తల్లులకు వివాహాలు చేయడం వలన జీవితంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముందస్తుగా గర్భం దాల్చడం, రక్తహీనత, సికిల్‌సెల్ ఎనిమీయా వ్యాప్తి వంటి భయంకరమైన పరిణామాలకు దారితీస్తోందన్నారు. ఏజెన్సీలో దివ్యంగుల సంభవం ఎక్కవ కావాడానికి బాల్య వివాహాలే కారణమన్నారు. బాల్య వివాహాలు జరిగితే వరుడు కూడా తీవ్రమైన పోక్సో ఆరోపణలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. బాల్య వివాహాలపై అవగాహన పౌరులను ప్రేరేపించడానికి ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. బాల్య వివాహాల`కోసం ఏదైన సమాచారం ఉంటే 9440933450 నంబర్‌కు తెలుపగలరని ,తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని, వారికి తగిన ప్రోత్సాహకాలు అందించనున్నట్టు చెప్పారు. ఐసీడీఎస్ పీవో రమణి, సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

వ్యక్తిగతంగా ఫిర్యాదుల స్వీకరణ



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు వివేకానందన్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పిర్యాదులు చేయాలని, ఈ మేరకు నేరుగా సంప్రదించవచ్చని, ఫోన్‌లో కూడా అందుబాటులో ఉంటానని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్ తెలిపారు.బుధవారం రాత్రి ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేశారు.ఇక్కడ అన్ని విభాగాల పనితీరును సమీక్షించి, పలు సూచనలిచ్చారు.అన్ని రాజకీయ పార్టీల నేతలు, సాధారణ పౌరులు, ఇతర వర్గాల వారు ఎవరైనా తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పాడేరు పీఎంఆర్సీ భవనంలో తాను బస చేసే రోజులలో ఉదయం 10 నుంచి ఉదయం 11గంటల లోపు సంప్రదించాలన్నారు. అలాగే 9014516237, 9014504385 నంబర్లకు వాట్సాప్ లేక వాయిస్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కలెక్టర్ విజయసునీత,జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.